సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 23 । జనవరి । 2025



సోమశిలలో 68.933 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం సాయంత్రానికి 68.933 టీఎంసీలు ఉన్నాయి. 1,890 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువ కాలువలకు 3850 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.82,600
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,520
3 శాతం జీఎస్టీతో	రూ.7,746
సవర (8 గ్రా)	రూ.61,968

గరిష్టం/కనిష్టం
30.0 /20.5

వాతావరణం

జిల్లాలో వాతావరణం గురువారం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ బుధవారం 63 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా జేఈఈ మెయిన్ పరీక్ష

- తొలిరోజు 1,200 మంది హాజరు



పొట్టేపాలెం అయాన్ డిజిటల్ జోన్ వద్ద పరీక్ష కేంద్రానికి వచ్చిన విద్యార్థులు

నెల్లూరు (టౌన్): ఐఐటీలు, ఎన్‌ఐటీల్లో ప్రవేశం కోసం బుధవారం నిర్వహించిన జేఈఈ మెయిన్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 3 సెంటర్లలో పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు రెండు విడతల్లో జరిగిన పరీక్షకు 1,200 మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే కేంద్రాల్లోకి అనుమతించారు. అయితే విద్యార్థులు పరీక్ష రాసేందుకు కేంద్రంలోకి వెళ్లడంతో వెంట వచ్చిన తల్లిదండ్రులు రోడ్డుపైనే వేసి ఉన్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

కలువాయి: కలువాయి పోలీసు స్టేషన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ బుధవారం విచారణ జరిపారు. కలువాయి మండలం వెరుబొట్లపల్లికి చెందిన కోలా వంశీ మరో యువకుడితో కలిసి ఈ నెల 18న బైక్‌లో వెళుతుండగా గేదెలు అడ్డు వచ్చాయి. వంశీ హారన్ కొట్టాడు. ఎందుకు హారన్ కొట్టావు, గేదెలు పొలంలో పడ్డాయి అంటూ గ్రామానికి చెందిన సంకల పవన్, మరో ఐదుగురు అతన్ని కులం పేరుతో దూషించి దాడి చేశారు. దీనిపై వంశీ పోలీసులకు ఫిర్యాదు మేరకు కలువాయి పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ వేణుగోపాల్ బాధితులను కలువాయికి పిలిపించి మాట్లాడారు. గ్రామానికి వెళ్లి విచారించారు.

జెడ్పీలో ఉద్యోగోన్నతులు



ఉద్యోగులతో జెడ్పీ చైర్‌పర్సన్

నెల్లూరు (పొగతోట): వివిధ మండలాల్లో పని చేస్తున్న జెడ్పీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ జెడ్పీ సీఈఓ విద్యారమ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ వారికి అందజేశారు. 17 మంది ఆఫీస్ సబార్డినేటర్లకు రికార్డు అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు, 4వ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు భీమ్ రెడ్డి, షేక్ మాబాషా పాల్గొన్నారు.

ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల – పెద్దాస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ / కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేసేందుకు విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం వివిధ ఉద్యోగాల కోసం గత డిసెంబర్ 1వ తేదీ నుంచి 11వ తేదీలోపు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విడుదల చేశామని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగరాజమన్నార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాను spsmellore.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. అభ్యర్థులు ఆ జాబితాను పరిశీలించుకుని ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 6వ తేదీ సాయంత్రం లోపు నేరుగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అందజేయాలని కోరారు. లేదా acsrgmcnlr@gmail.com నందు జతపరిచిన గ్రీవెన్స్‌లో మాత్రమే పంపాలని సూచించారు.

శ్రీవారికి చందనాలంకారం



బంగారు గరుడ వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహుడు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి చందనాలంకరణలో భక్తులకు అభయమిచ్చారు. బుధవారం స్వాతి నక్షత్రం శ్రీవారి జన్మనక్షత్రం కావడంతో స్వామివారి మూల మూర్తికి చందనంతో అలంకరించినట్లు దేవస్థాన ప్రధానార్చకులు తెలిపారు. ఉదయం అభిషేకం, చందన అలంకరణ, 9 గంటలకు శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం, 11 గంటలకు కల్యాణం, 1 గంటకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం శ్రీవారి బంగారు గరుడ వాహనంపై ఉత్సవ విగ్రహాన్ని కొలువు దీరి లక్ష్మీనరసింహస్వామి మాఢవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

సింహపురి.. సాఫ్ట్‌వేర్ హబ్



విక్టరీ సింబల్ చూపిస్తున్న ఉద్యోగులు



ఉద్యోగాల కోసం ఎదురు చూపులకు ఫుల్‌స్టాప్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం అనేది ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని యువత కల. తల్లిదండ్రుల ఆశ. ఇలాంటి కొలువుల కోసం పక్క రాష్ట్రాలకే కాకుండా సప్త సముద్రాలు దాటి వెళ్తున్నారు. అలాంటి కొలువులకు సింహపురి హబ్‌గా మారింది. సాఫ్ట్‌వేర్ చదువులు చదివి.. ఎక్కడో ఎవడి కోసమో ఎందుకు పని చేయాలని భావించిన కొందరు సింహపురి టెకీలు.. సొంతంగా సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా రాణిస్తున్నారు. పారిశ్రామికంగా, వ్యాపార పరంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాలో కంపెనీలు, వ్యాపారస్తులకు అవసరమైన సాఫ్ట్‌వేర్స్ రూపొందిస్తున్నారు.

- 'సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్' కోర్సుతో సొంతంగా ఉపాధి
- జిల్లాలో 20 సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ స్టార్టప్ సంస్థల ఏర్పాటు
- సరికొత్త యాప్స్, వెబ్‌సైట్లను రూపొందిస్తున్న నెల్లూరు యువత
- కంపెనీలు, వ్యాపారస్తులకు అవసరమైన సాఫ్ట్‌వేర్ రూపకల్పన

నెల్లూరు సిటీ: సాంకేతిక రంగం కొత్త పుంతలు తొక్కుతున్న నేపథ్యంలో సాఫ్ట్‌వేర్ రంగ సంస్థలు కొలువులకు కోతలు విధిస్తున్నాయి. భవిష్యత్ కలలతో కష్టపడి ఇంజినీరింగ్ పూర్తి చేసినా.. ఉద్యోగాలు లేక ఎంతో మంది యువత ఖాళీగానే ఉండిపోతున్నారు. ఉద్యోగాలు కల్పించే కొన్ని సాఫ్ట్‌వేర్ సంస్థలు పూర్వానుభవం అడుగుతున్నారు. ఈ పరిస్థితుల్లో దొరికిన చిన్న ఉద్యోగాలు చేయలేక.. మంచి ఉద్యోగాలు పొందలేక యువత నలిగిపోతోంది. అయితే కొంత మంది సాఫ్ట్‌వేర్‌లు ఉద్యోగాల కోసం వెంపర్లాడకుండా తమ కాళ్లపై తామే నిలబడే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. తమ వద్ద టాలెంట్ ఉంటే మనం ఉద్యోగం చేయడం ఎందుకు.. మనమే ఉద్యోగాలు కల్పించవచ్చని ఆలోచన చేస్తున్నారు. ఈ క్రమంలో 'సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్' కోర్సులను నేర్చుకుని తామే వెబ్‌సైట్లు, యాప్స్‌ను రూపొందిస్తున్నారు.

జిల్లాలో 20 వరకు 'సాఫ్ట్‌వేర్' సంస్థలు

సాఫ్ట్‌వేర్ కొలువులకు ఇప్పటి వరకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పూణే అడ్డాగా ఉన్నాయి. తాజాగా సింహపురికి చెందిన టాలెంటెడ్ సాఫ్ట్‌వేర్స్



పనిచేస్తున్న ఉద్యోగులు

నెల్లూరును 'సాఫ్ట్‌వేర్' హబ్‌గా మార్చేస్తున్నారు. ప్రధాన నగరాల్లో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కోర్సును నేర్చుకుని తమ సొంత జిల్లాలోనే ఉపాధి కల్పించుకుంటున్నారు. (mysql, python, php, hmtl, css, javascript, react, nodejs, android, ios, java) ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ ద్వారా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామింగ్‌ను తయారు చేస్తున్నారు. సరికొత్త సాఫ్ట్‌వేర్‌ను పూర్తిగా కమాండ్స్ ద్వారానే పూర్తి చేయాల్సి వస్తుంది.

స్వయం ఉపాధి కల్పించుకుంటున్న యువత

సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కోర్సును నేర్చుకున్న కొంత మంది నెల్లూరుకు చెందిన యువత సొంతంగా జిల్లాలోనే ఓ కంపెనీని ఏర్పాటు చేసుకున్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో ఇప్పటి వరకు దాదాపు 20 సంస్థలు ఏర్పాటయ్యాయి. ఆయా సంస్థల ద్వారా వందల సంఖ్యలో సాఫ్ట్‌వేర్ డెవలపర్స్‌ను నియమించుకుని తాము ఉపాధి పొందుతూ, మరి కొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. జిల్లాలోని వ్యాపారస్తులకు, కంపెనీలకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సాఫ్ట్‌వేర్‌తోపాటు కొన్ని యాప్స్‌ను, సాఫ్ట్‌వేర్‌లను, వెబ్‌సైట్లను రూపొందిస్తున్నారు. నెల్లూరులోని పలు సంస్థలు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తూ ఉద్యోగాలు కల్పిస్తున్నారు. దీంతో నిరుద్యోగ యువతకు సొంత ఊర్లలోనే ఉపాధి కల్పించేందుకు దోహద పడుతున్నాయి. జిల్లాలో సాఫ్ట్‌వేర్‌లో వందలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.

కస్టమర్‌కు అనుగుణంగా సాఫ్ట్‌వేర్ తయారీ

జిల్లాలో పారిశ్రామికంగా, వ్యాపారపరంగా అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతోంది. ఆయా రంగాల్లో చిన్న తరహా నుంచి పెద్ద తరహా వ్యాపారాలు, కంపెనీల వారికి అవసరమైన విధంగా సాఫ్ట్‌వేర్‌లను రూపొందించి ఇస్తున్నారు. రిటైల్, హోల్‌సేల్, సూపర్ మార్కెట్, టెక్స్‌టైల్స్, రెడీమేడ్స్, ఆన్‌లైన్ షాపింగ్, వెబ్‌సైట్స్‌కు అనుగుణంగా బిల్లింగ్‌లకు సాఫ్ట్‌వేర్‌లను సిద్ధం చేస్తున్నారు. పనిఒత్తిడి తగ్గడంతో బిల్లింగ్ వేగవంతంగా ఉండే విధంగా వారికి కావలసిన విధంగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తారు. స్వచ్ఛంద ట్రస్ట్‌లకు, కళాశాలలకు, పాఠశాలలకు, యూనివర్సిటీలకు మరి కొన్ని రంగాలకు ఇంటర్‌నెట్‌లో పబ్లిక్ వెబ్‌సైట్లను రూపొందిస్తున్నారు.

సొంతంగా ఉపాధి కల్పించుకున్నాను



హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కోర్సును 12 ఏళ్ల క్రితం నేర్చుకున్నాను. సొంతంగా నెల్లూరులోనే కంపెనీ ఏర్పాటు చేసుకుని మరి కొందరికి ఉపాధి కల్పిస్తున్నాను. ప్రస్తుతం యువత తాము చదివిన చదువుకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు రాక నిరాశ పడుతున్నారు. ఆలోచన ఉంటే ఏదైనా సాధించవచ్చు. స్కిల్స్ నేర్చుకోవడం ద్వారా సొంతంగా ఉపాధి కల్పించేందుకు వీలు ఉంటుంది.

– అబ్దుల్ రజాక్, ఆప్టిమస్ ఐటీ సొల్యూషన్స్ నిర్వాహకుడు

నిత్యం కొత్తగా నేర్చుకుంటూనే ఉంటాం



15 ఏళ్ల నుంచి సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఉన్నాను. కొత్త వెబ్‌సైట్లు, సాఫ్ట్‌వేర్ యాప్స్‌ను రూపొందిస్తుంటాం. ప్రస్తుత టెక్నాలజీలో నిత్యం కొత్తగా నేర్చుకుంటూనే ఉంటాం. అదే విధంగా కస్టమర్‌లకు నాణ్యమైన సేవలు అందించడంలో ఇతర సంస్థలతో పోటీ పడాల్సి ఉంది.

– అల్తాఫ్ బాషా, ఎస్‌ఏబీ సాఫ్ట్ నిర్వాహకుడు

స్కిల్స్ ఉంటే ఉద్యోగాలు వెతుక్కుంటూ వస్తాయి



నేను హైదరాబాద్‌లో వెబ్ డెవలపర్ కోర్సు నేర్చుకున్నాను. నెల్లూరు సొంతూరు కావడంతో ఇక్కడే పనిచేయాలని నిర్ణయించుకున్నాను. ఓ సంస్థలో వెబ్ డెవలపర్‌గా ఉద్యోగావకాశం వచ్చింది. నెల్లూరులోనే పని చేస్తున్నాను. ఎందులోనైనా స్కిల్స్ నేర్చుకుంటే ఉద్యోగాలు వెతుక్కుంటూ వస్తాయని నమ్ముతాను.

– ఇంగిలాల శ్యామ్, వెబ్ డెవలపర్

శిక్షణ తీసుకుని ఉద్యోగం చేస్తున్నాను



నేను ఇంజినీరింగ్ పూర్తిచేశాను. నాలుగేళ్ల క్రితం ఇప్పుడు చేస్తున్న కంపెనీలోనే ప్రోగ్రామర్‌గా శిక్షణ తీసుకున్నాను. మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ తీసుకున్నాను. పూర్తిగా ప్రోగ్రామింగ్ నేర్చుకుని ఉద్యోగం చేస్తున్నాను.

– జలీల్, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్, ఆప్టిమస్ ఐటీ సొల్యూషన్స్

భూములు కాపాడేందుకు ఏం చేస్తున్నారో చెప్పండి

- 150 ఎకరాల అటవీ భూమి విషయంలో నివేదిక ఇవ్వండి
- అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారి, నెల్లూరు కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: నెల్లూరు జిల్లా రాపూరు మండలం నెల్లేపల్లి గ్రామ పరిధిలో ఉన్న అటవీ భూమిలో దాదాపు 150 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు విచారణలో తేలిన నేపథ్యంలో ఆక్రమణదారుల నుంచి ఆ భూమిని కాపాడేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో నివేదిక అందజేయాలని హైకోర్టు బుధవారం అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారితోపాటు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ఆక్రమణల తొలగింపునకు తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ తమ ముందు నివేదిక ఉంచాలని వారికి ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తూ.. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. రాపూరు, నెల్లూరు రేంజ్ పరిధిలో ఉన్న పోతుకొండ రిజర్వ్ ఫారెస్ట్‌కు చెందిన 150 ఎకరాల భూమి ఆక్రమణలకు గురైందని, అయినప్పటికీ ఆక్రమణలను తొలగించడం లేదంటూ వెలుగోను గ్రామానికి చెందిన రైతు అందెన వెంకటరమణయ్య హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వైఎల్ శివకల్పన రెడ్డి వాదనలు వినిపిస్తూ, నెల్లేపల్లి గ్రామ పరిధిలోని వివిధ సర్వే నంబర్లలో దాదాపు 1200కు పైగా అటవీ భూమి ఉందన్నారు. ఇందులో దాదాపు 150 ఎకరాలకు పైగా భూమి ఆక్రమణలకు గురైందన్నారు. 40 మంది ఆ భూమిని ఆక్రమించుకున్నారని తెలిపారు. ఈ విషయాన్ని రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సంయుక్త సర్వే ద్వారా కూడా తేల్చారని ఆమె ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఆక్రమణలపై అధికారులకు ఎన్ని సార్లు వినతి పత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేకపోయిందన్నారు. శివకల్పన వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఆక్రమణల తొలగింపునకు ఏం చర్యలు తీసుకున్నారో వివరిస్తూ ఓ నివేదికను తమ ముందుంచాలని అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారి, నెల్లూరు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది.

ఆక్రమిత భూములపై సర్వే

టీడీపీ నాయకుడి చెరలో 63 ఎకరాలు

- ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్న జిల్లా సర్వే శాఖ ఏడీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా సర్వే శాఖ ఏడీ

ఆత్మకూరు: చేజర్ల మండలంలోని పెళ్లేరు గ్రామ రెవెన్యూ (పుల్లనీళ్లపల్లి)లో వివాదాస్పద భూములను జిల్లా సర్వేయర్ నాగశేఖర్, సిబ్బంది బుధవారం పరిశీలించారు. 1976లో 45 మందికిపైగా ఎస్సీ, ఎస్టీ దళిత కుటుంబాలకు అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసిన భూమిని దశాబ్దం క్రితం స్థానిక టీడీపీ నాయకుడు ఆక్రమించుకొని సాగు చేస్తున్నాడు. దీనికితోడు ఈ భూమిని తన కుటుంబీకుల పేరు మీద 1బీ, అడంగళ్‌లో మార్చుకున్నాడు. ఈ విషయమై బాధిత దళిత కుటుంబాలు ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నాయి. గత నెలలో కలెక్టర్‌కు వినతి పత్రాలు కూడా అందజేశారు. ఆయన ఆదేశాల మేరకు సర్వే శాఖ ఏడీ నాగశేఖర్, మండల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందితో కలిసి వివాదాస్పద భూములను పరిశీలించి సర్వే నిర్వహించారు. సర్వే నంబరు 509, 508, 510, 511, 512లో సీలింగ్ భూములు 42 ఎకరాలు, ప్రభుత్వ భూములు 21 ఎకరాలను ఇందిరాగాంధీ ప్రభుత్వ కాలంలో 45 కుటుంబాలకు భూ పంపిణీ చేశారు. ఆ భూములను టీడీపీ నాయకుడు ఆక్రమించుకున్నారు. ఏడీ నాగశేఖర్ మాట్లాడుతూ ఈ భూములు ప్రభుత్వ, సీలింగ్ భూములేనని, పూర్తి స్థాయి నివేదికను సీసీఎల్ఏకు, జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. భూముల సర్వే అనంతరం తూర్పుపల్లి సచివాలయంలో ఇరువర్గాలతో సమావేశమైన క్రమంలో అధికారుల ఎదుటే సదరు టీడీపీ నాయకుడు దళితులతో వాదనకు దిగాడు. ఇరువర్గాలు వాదులాడుకోవడంతో రెవెన్యూ అధికారులు సమావేశం ముగించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్వేయర్ పి.శాంత, రంగస్వామి, ఒంటేరు శ్రీను, మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

స్టీల్ సామాన్ల వ్యాపారి హతం

- గొంతు నులిమి దారుణం
- ఆస్తి వివాదాలే కారణమని సమాచారం
- రెండో కుమారుడిపై అనుమానం





ఆటోలోనే హత్యకు గురైన దేవళ్ల రమేష్ (ఇన్‌సెట్) రమేష్ (ఫైల్)

కొడవలూరు: ఆటోలో ఊరూరు తిరుగుతూ స్టీల్ సామాన్ల వ్యాపారం చేస్తున్న వ్యక్తి హత్యకు గురయ్యాడు. వ్యాపార నిమిత్తం ఆటోలో వెళ్తుండగా రెండు కార్లలో వచ్చిన నిందితులు ఆటకాయించి అతని గొంతు నులిమి హత్య చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటన మండలంలోని మిక్కిలింపేట వద్ద బుధవారం వేకువ జామున జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం మండలం చల్లాయపాళేనికి చెందిన దేవళ్ల రమేష్ (50) ఆటోలో స్టీల్ సామాన్లు వేసుకుని గ్రామాల్లో తిరుగుతూ వ్యాపారం చేస్తుంటారు. ఆయన భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇరవై ఏళ్ల క్రితమే భార్యను వదిలేసి తమిళనాడుకు చెందిన మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఆ మహిళకు అప్పటికే ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొంత కాలంగా రమేష్ వ్యాపారం లాభసాటిగా ఉండడంతో ప్లాటు, దుకాణం కొనుగోలు చేశారని సమాచారం. ఇలా సంపాదించిన ఆస్తులను సహజీవనం చేస్తున్న మహిళ సంతానానికి ఇచ్చేస్తున్నారన్న విషయంపై రెండో కుమారుడు మూడు నెలల క్రితం తండ్రితో గొడవ పడ్డారని పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే రెండు కార్లలో వచ్చిన వ్యక్తులు రమేష్ ఆటోను అటకాయించి గొంతు నులిమి హత్య చేశారు. ఆ సమయంలో రమేష్‌తో సహజీవనం చేస్తున్న మహిళ కుమారుడు రమేష్ పక్కనే ఉన్నారు. ఆ యువకుడు రమేష్ తన రెండో కుమారుడే హత్య చేశారని చెబుతుండడం, మూడు నెలల క్రితం తండ్రి రమేష్‌తో ఆ వ్యక్తి గొడవ పడి ఉండడంతో అతనే ఈ హత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ దిశగానే దర్యాప్తు చేస్తున్నారు. హత్య జరిగిన విషయం తెలుసుకున్న నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, కొడవలూరు సీఐ ఎ.సురేంద్రబాబు, ఎస్సై సీహెచ్ కోటిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. మృతుడి మొదటి భార్య రెండో కుమారుడిపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నా ఇష్టం... నీకు సమాధానం చెప్పను



ఇంటి పన్ను కట్టేందుకు వచ్చిన వ్యక్తితో దురుసుగా మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి

- పంచాయతీ కార్యదర్శి దురుసు ప్రవర్తన
- ఇంటి పన్ను కట్టేందుకు వచ్చిన వ్యక్తిపై చిందులు
- వైరల్‌గా మారిన వీడియో

బిట్రగుంట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికార యంత్రాంగంలో జవాబుదారీతనం లోపించింది. గతంలో పౌర సేవలకు నిర్దిష్ట కాలపరిమితి విధించి గడువులోగా కచ్చితంగా పని చేసేలా అధికారులపై పర్యవేక్షణ ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో కొంత మంది ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పనులపై కార్యాలయాలకు వచ్చే ప్రజలను పురుగులకన్నా హీనంగా చూస్తున్నారు. ప్రశ్నించే వారిపై కేసులు పెడతామంటూ బెదిరిస్తున్నారు. పంచాయతీ కార్యాలయంలో మాజీ సీఎం ఫొటో పెట్టాలని అడిగిన వార్డు సభ్యులపై బోగోలు పంచాయతీ కార్యదర్శి పోలీసు కేసు పెట్టి వేధింపులకు దిగిన విషయం మరిచిపోక ముందే.. ఇంటి పన్ను కట్టేందుకు వచ్చిన వ్యక్తిపై నాగులవరం పంచాయతీ కార్యదర్శి విరుచుకు పడ్డాడు.

ఎస్సైకి ఫోన్ చేసి పిలిపిస్తానంటూ బెదిరింపు

తనకు తానుగా ఇంటి పన్ను కడతానని వస్తే.. ఏం మాట్లాడతారని ప్రశ్నించడంతో.. ఎక్కువ మాట్లాడితే ఎస్సైకి ఫోన్ చేసి పిలిపిస్తానంటూ బెదిరింపులకు దిగాడు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని నాగులవరం పంచాయతీకి చెందిన వ్యక్తి ఇంటి మీద రుణం తీసుకునేందుకు ఇంటి పన్ను చెల్లించిన రసీదులు అవసరం కావడంతో సచివాలయంలోని పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌రావును సంప్రదించి ఇంటి పన్ను కట్టించుకోవాలని కోరాడు. ఎందుకు ఇంటి పన్ను కడుతున్నారో తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి ఇంటి పన్ను కట్టించుకునేందుకు నిరాకరిస్తూ దురుసుగా మాట్లాడాడు. ఎందుకు కట్టించుకోరని నిలదీయడంతో 'దబాయిస్తున్నావేంటి.. నేను కట్టించుకోను.. నువ్వు లోన్ తీసుకుని కట్టకపోతే ఎవరు బాధ్యులు.. లోన్ కోసం కాకపోతే ఎందుకు ఇంత సేపు ఉన్నావ్ ఇక్కడ.. నేను కట్టించుకోను.. నేను అందరికీ డిమాండ్ నోటీసు ఇస్తాను.. అప్పుడు వచ్చి కట్టుకోండి. పంచాయతీ ఆఫీస్‌లోనో.. బ్యాంకులోనో కట్టుకోండి' అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. అధికారి అయి ఉండి ఇలా మాట్లాడడం సరికాదు సార్, నిన్న వచ్చినా కూడా మీరు సరిగా సమాధానం చెప్పకుండా వెళ్లిపోయారు అని బాధిత వ్యక్తి మాట్లాడగా పంచాయతీ కార్యదర్శి మళ్లీ దురుసుగా స్పందించాడు. 'సమాధానం చెప్పను, కట్టించుకోను ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో పో.. మీరు ఎంప్లాయ్‌ని ఒత్తిడి చేయకూడదు... ఇప్పుడు నేను ఎస్సైకి ఫోన్ చేసి పిలిపిస్తా..' అంటూ ఇంటి పన్ను కట్టించుకునేందుకు వచ్చిన వ్యక్తిపైనే బెదిరింపులకు దిగాడు. దీంతో బాధితుడు కూడా ఎస్సై గారిని పిలిపించండి సార్, నేను మిమ్మల్ని ఏం ఒత్తిడి చేశానో చెప్పండి సార్ అంటూ నిలదీశాడు. ఇద్దరి మధ్య జరిగిన వాగ్వాదం అంతా వీడియోలో రికార్డు అయింది. ప్రస్తుతం ఈ వీడియో వాట్సప్ గ్రూపులు, ఫేస్‌బుక్‌లో వైరల్‌గా మారింది. ఈ విషయమైన ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు. పరిశీలించి వాస్తవాలు తెలుసుకుంటానని తెలిపారు.

హైవే పనుల అడ్డగింత

- పోలీసు రక్షణలో పైరును దున్నేసిన అధికారులు



హైవే పనుల వద్ద బాధితుల ఆందోళన

సీతారామపురం: సాగులో ఉన్న పైరును అధికారులు దున్నడంతో బుధవారం పబ్బులేటిపల్లిలో ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామానికి చెందిన పోరుమామిళ్ల లక్ష్మయ్య అన్నదమ్ములకు సంబంధించిన పొలం ఆరు లేన్ల జాతీయ రహదారి నిర్మాణ పనులకు అడ్డంకిగా మారింది. ఐదెకరాల ఉమ్మడి భూమిలో 1.25 ఎకరాల భూమి జాతీయ రహదారి నిర్మాణానికి తీసుకుని నష్ట పరిహారం చెల్లించగా, అందులో ఉన్న 23 టేకు చెట్లు, ఓ చింతచెట్టు, బోరు, తెట్టుగోడలకు నష్టపరిహారం చెల్లించలేదు. ప్రస్తుతం పొలంలో పైరు కూడా సాగులో ఉంది. ఈ నేపథ్యంలో బుధవారం పోలీసు బలగాలు, రెవెన్యూ అధికార యంత్రాంగం పబ్బులేటిపల్లికి చేరుకొని ఆ భూమిలోకి ప్రవేశించగా బాధితులు యంత్రాలకు అడ్డుపడ్డారు. కేవలం భూమికి మాత్రమే నష్టపరిహారం చెల్లించారని, పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించిన తర్వాతే పొలంలోకి దిగాలని డిమాండ్ చేశారు. తర్వాత చెల్లిస్తామని అధికారులు సర్దిచెప్పినా వినలేదు. ఎట్టకేలకు పోలీసుల ప్రమేయంతో యంత్రాలకు అడ్డుగా ఉన్న వారిని తొలగించి పొలంలోని పైరును దున్నేశారు. కనీసం పైరు కోసుకునే వరకు గడువు కోరినా అటు అధికార యంత్రాంగం, ఇటు రోడ్డు నిర్మాణదారు కనికరించలేదని బాధితులు లబోదిబోమంటున్నారు.

క్లుప్తంగా

కాంట్రాక్ట్ పనుల బిల్లులు రాక..

- ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం

నెల్లూరు(క్రైమ్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగరంలోని ముకుందపురంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నవాబుపేటలోని ముకుందపురానికి చెందిన విజయభాస్కర్‌రెడ్డి (54) కర్ణాటకలోని హసన్ జిల్లాలో గల ఓ ప్రైవేట్ కంపెనీలో కాంట్రాక్ట్ పనులు చేశారు. అయితే సదరు కంపెనీ బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థికంగా చితికిపోయారు. సమస్యలు చుట్టుముట్టడంతో దిక్కుతోచని స్థితిలో తన ఇంట్లో విషాన్ని మంగళవారం సేవించారు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందారు. ఘటనపై నవాబుపేట పోలీసులకు మృతుడి కుమారుడు సాయితేజ ఫిర్యాదు చేశారు. పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- దంపతులకు గాయాలు



అంబులెన్స్‌లో క్షతగాత్రుల తరలింపు

మనుబోలు: బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో దంపతులు గాయపడిన ఘటన మనుబోలు బైపాస్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. మనుబోలులోని కోదండరామపురానికి చెందిన శంకరయ్య, విజయలక్ష్మి దంపతులు బుల్లెట్‌పై గూడూరు బయల్దేరారు. ఈ క్రమంలో నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళ్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొంది. ఘటనలో గాయపడిన వీరిని అంబులెన్స్‌లో గూడూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని వాహనచోదకుడి మృతి



నెల్లూరు సిటీ: ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో వాహనచోదకుడు మృతి చెందిన ఘటన చింతారెడ్డిపాళెం సమీపంలోని పాతమిట్టపాళెం వద్ద బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. కాకుపల్లికి చెందిన కలిచేటి కోటారెడ్డి (85), లీలావతి దంపతులు నగరంలోని ఓ బ్యాంక్‌కు టీవీఎస్ వాహనంపై బయల్దేరారు. అనంతరం తిరిగి వెళ్తుండగా, చింతారెడ్డిపాళెం సమీపంలోని పాతమిట్టపాళెం వద్ద వెనుక నుంచి వచ్చిన ఇసుక ట్రాక్టర్ ఢీకొంది. వాహనం అదుపుతప్పడంతో ముందు టైర్ల కింద కోటారెడ్డి పడి అక్కడికక్కడే మృతి చెందారు. సమీపంలోని పొలంలో పడిన లీలావతి స్వల్పంగా గాయపడ్డారు. నెల్లూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు

పొదలకూరు (కిలో)

పెద్దవి: రూ.35
సన్నవి: రూ.20
పండ్లు: రూ.15



కలిసి రాని సేద్యం

- వరిసాగుపై ప్రకృతి ప్రభావం
- కరకు దశలోనే వెన్ను తీస్తున్న పైరు
- ఈ రబీలో పెరిగిన వ్యవసాయ ఖర్చులు
- అన్నదాతల ఆందోళన



ముందస్తుగా వెన్ను తీసిన వరి పంట

పొదలకూరు: ఆరుగాలం కష్టించే అన్నదాతకు ఈ ఏడాది వ్యవసాయం కలిసిరావడం లేదు. ప్రస్తుత రబీ సీజన్లో నార్లు పోసింది మొదలుకొని వరి సాగులో ఇదే పరిస్థితి నెలకొంది. వాతావరణ ప్రభావంతో వరిలో పెరుగుదల లోపించింది. పైరు కరకు దశలోనే వెన్ను తీస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిణామాలతో కోతల సమయంలో ధాన్యం దిగుబడి తగ్గుతుందనే భయం వెంటాడుతోంది.

నాట్లు వేసిన నాటి నుంచి అంతే..

జిల్లాలో 4.53 లక్షల మంది రైతులు 7.77 లక్షల ఎకరాల్లో రబీలో వరిసాగు చేస్తున్నారు. ప్రధానంగా 90 శాతం మంది రైతులు కేఎస్‌ఎం – 1630, ఆరెన్నార్ – 15048 వరి రకాలను సాగు చేస్తున్నారు. అయితే వాతావరణ మార్పుల కారణంగా నాట్లు వేసిన నాటి నుంచే ముసురు, జడివానలు పంటపై ప్రభావం చూపాయి. దీనికి తోడు వరి వెన్ను దశ త్వరగా రావడంతో దిగుబడి తగ్గే అవకాశం ఉంది. సాధారణంగా ఏ పంటకైనా సరిపడా సూర్యరశ్మి ఉంటేనే ఆశించిన స్థాయిలో పెరుగుతుంది. అయితే ముసురు, జడివానలతో ఇది సక్రమంగా లేక పోవడం దిగుబడి తగ్గేందుకు ఓ కారణమని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

ముందస్తు వెన్నుపై ఆందోళన

సాధారణంగా వరి నాటిన రెండు నెలల్లో పంట వెన్ను తీస్తుంది. అయితే జిల్లా వ్యాప్తంగా 50 శాతం పంట నాటిన నెల తర్వాతే వెన్ను తీస్తోంది. సాధారణంగా రైతులు రెండు.. మూడు మొక్కలు నాటుతారు. వాటిలో వెనుకా, ముందూ వెన్ను తీయడం సాధారణం. అయితే అందుకు భిన్నంగా ఇప్పుడు ముందస్తుగా వెన్ను తీయడంపై రైతులు గగ్గోలు పెడుతున్నారు. సాగునీటి సమస్యలు, ముందుగా పంటలు చేతికొస్తాయనే ఉద్దేశంతో జిల్లాలోని కొందరు రైతులు అక్టోబర్‌లో కూనారం (కేఎస్‌ఎం – 1638), ఆరెన్నార్ (తెలంగాణ మసూర) 15048 రకం వరినాట్లు వేశారు. అప్పట్లో నాట్లు వేసిన వరి పంటకు ముందస్తుగా వెన్ను తీస్తున్నారని వ్యవసాయాధికారులు వెల్లడిస్తున్నారు. తెలంగాణలో ఆరెన్నార్ రకం విత్తనంతో నాట్లను డిసెంబర్ చివర్లో వేస్తారని ఇదే తరహాలో మన ప్రాంతంలోనూ నవంబర్ రెండు లేదా మూడో వారంలో వేస్తే మంచి ఫలితం ఉంటుందంటున్నారు. అయితే నవంబర్ 15 తర్వాత నాట్లు పడిన పంటలోనూ ముందస్తుగా వెన్ను తీయాల్సి వస్తోందని రైతులు చెప్తున్నారు.

పొటాష్ వేయాలి

ముందస్తు వెన్ను తీయడంపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. వరుస వర్షాలు, సూర్యరశ్మి తక్కువగా ఉండటంతో ముందుగా వెన్ను తీస్తోందని చెప్తున్నారు. దిగుబడి తగ్గకుండా రైతులు వెంటనే ఎకరాకు 50 కిలోల యూరియాలో 20 కిలోల పొటాష్‌ను కలిపి చల్లాలని సూచిస్తున్నారు. పొదలకూరు, కావలి, జలదంకి, కొండాపురం తదితర మండలాల్లో ఈ సమస్య అధికంగా ఉందని తెలుస్తోంది.



1638 రకంలో వెన్ను

వరి సాగు సంతృప్తిగా లేదు



ప్రతి రబీ సీజన్లో మాదిరిగా పరిస్థితి ప్రస్తుతం సంతృప్తికరంగా లేదు. ముందుగానే వెన్ను తీయడమే కాకుండా యూరియాను విడతల వారీగా చల్లుతున్నా పంట సక్రమంగా ఎదగడం లేదు. దిగుబడి తగ్గుతుందనే భయం చాలా మందిలో నెలకొంది. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి ఎదురుకాలేదు.
– దయాకర్‌రెడ్డి, రైతు, కల్యాణపురం

ముందస్తు వెన్ను తీయడంపై ఆందోళన



వరి పంటలో ముందస్తుగా వెన్ను తీయడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట దిగుబడి తగ్గుతుందనే అనుమానాలున్నాయి. క్షేత్రస్థాయిలో తేడా కనిపిస్తుండటంతో పెట్టుబడులు పెట్టిన అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.
– కృష్ణారెడ్డి, రైతు, మహ్మదాపురం

దిగుబడి తగ్గదు



వరి పంట దిగుబడి తగ్గదు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సూర్యరశ్మి తగ్గి ముందుగా వెన్ను తీసింది. మరో నెల పాటు పంట కాలం ఉండటంతో వెనుకా ముందుగా పంట కలుసుకొని దిగుబడి వస్తుంది. యూరియా, పొటాష్ చల్లకపోతే నత్రజని పెరిగి నష్టం వాటిల్లే పరిస్థితి ఉండదు.
– వాసు, ఏఓ, పొదలకూరు

వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- ఎస్పీ కృష్ణకాంత్



మాట్లాడుతున్న కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎస్పీ కృష్ణకాంత్ సూచించారు. నగరంలోని పోలీస్ కవాతు మైదానంలో జిల్లా సాయుధ బలగాల సిబ్బందికి యాన్యువల్ మొబిలైజేషన్‌ను బుధవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లా సాయుధ దళం సంక్లిష్ట విభాగమని, సాధారణ బందోబస్తు మొదలుకొని శాంతిభద్రతల పరిరక్షణ, వీఐపీ, వీవీఐపీల భద్రతలో కీలకపాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. వృత్తిపరమైన నైపుణ్యాలు, మెలకువలను ఏకాగ్రతతో సాధన చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెప్పారు. అత్యాధునిక ఆయుధాల వినియోగం, ఫైరింగ్, డ్రిల్, మార్చ్‌పాస్ట్, మాబ్ కంట్రోల్ తదితర అంశాల్లో నైపుణ్యాల మెరుగునకు మొబిలైజేషన్ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఏఎస్పీ సౌజన్య, నెల్లూరు నగర, రూరల్, ఏఆర్ డీఎస్పీలు సింధుప్రియ, శ్రీనివాసరావు, చంద్రమోహన్, ఆర్‌ఐలు అంకమరావు, హరిబాబు, రాజారావు, పాల్‌రాజు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న గంగాభవాని

నెల్లూరు (పొగతోట): విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ గంగాభవాని స్పష్టం చేశారు. నగరంలోని డ్వామా కార్యాలయం నుంచి టీఏలు, ఈసీలు, ఏపీఓలు, ఏపీడీలతో బుధవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. మినీ గోకులాల నిర్మాణాలను ఈ నెల 31లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణాలు వంద శాతం పూర్తి చేసిన మండలాలకే కొత్త అనుమతులను మంజూరు చేయనున్నామని వెల్లడించారు. జిల్లాలో రూ.31 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలకు అనుమతులను మంజూరు చేశామన్నారు. ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచాలని చెప్పారు. పనుల కల్పనలో నెల్లూరు, కోవూరు, కావలి, అల్లూరు, బోగోలు తదితర మండలాలు వెనుకబడి ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై లిఖితపూర్వక ఫిర్యాదును అందజేయాలని ఏపీడీలను ఆదేశించారు. క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 138
లేయర్ (లైవ్) : 88
బ్రాయిలర్ చికెన్ : 246
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 270
లేయర్ చికెన్ : 150



రెడ్‌క్రాస్‌లో ఏకపక్ష నిర్ణయాలు

- నేటి సాయంత్రం నూతన చైర్మన్ ఎంపిక పేరుతో అజెండా
- కలెక్టర్ చాంబర్‌లో సమావేశం
- చర్చించుకోలేదంటున్న ఎమ్సీ మెంబర్లు

నెల్లూరు(అర్బన్): వివిధ ప్రాజెక్ట్‌లతో ప్రజలకు విశిష్టమైన సేవలందిస్తున్న రెడ్‌క్రాస్‌లో ఇప్పుడు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు జరిగిపోతున్నాయి. ఈ వ్యవహారంలో మంత్రి విద్యాసంస్థల్లో కీలకపాత్ర పోషిస్తున్న వ్యక్తి చక్రం తిప్పుతున్నారని తెలుస్తోంది. ఈ క్రమంలో చట్టబద్ధంగా ఎన్నికైన రెడ్‌క్రాస్ పాలకమండలి కమిటీ సభ్యులు రాజకీయ పార్టీల్లో పనిచేస్తున్నారంటూ ఐదుగురిపై కలెక్టర్ ఆనంద్ మంగళవారం చర్యలు చేపట్టి వారిని తొలగించారు. దీంతో 15 మంది ఎమ్సీ మెంబర్లలో పది మంది మిగిలారు.

అంతా గుట్టుచప్పుడు..

వాస్తవానికి నూతన చైర్మన్‌ను ఎన్నుకునేందుకు ముందుగా ఎమ్సీ మెంబర్లతో మాట్లాడాలి. అయితే ఇప్పుడు అలా జరగలేదు. ఎవరితో చర్చించకుండానే కలెక్టరేట్లో నూతన చైర్మన్ ఎన్నిక గురువారం సాయంత్రం నాలుగు గంటలకనే ఏకైక అజెండాతో ఎమ్సీ మెంబర్లకు ఆహ్వాన లేఖలను కలెక్టర్ పంపారు.

అధికార పార్టీకి అనుకూలమైన వారికే..

రెడ్‌క్రాస్‌లో నాయకత్వం లేకపోవడంతో ఎవరి దారి వారిదే అనే తరహాలో పరిస్థితి మారింది. ఈ క్రమంలో టీడీపీకి అనుకూలంగా ఉన్న వ్యక్తిని రెడ్‌క్రాస్ చైర్మన్‌గా ఎన్నుకునేందుకు మంత్రి ప్రధాన అనుచరుడు రంగం సిద్ధం చేశారని తెలుస్తోంది. చైర్మన్ రేసులో వాకాటి విజయకుమార్‌రెడ్డి పేరు ప్రధానంగా వినిపిస్తోంది.

ఎమ్సీ మెంబర్ల అసంతృప్తి

ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ మెంబర్లలో ఎక్కువ మంది తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఉన్న పది మంది కూడా ఒక చోట కూర్చొని చర్చించుకునే అవకాశం కల్పించలేదని ఆవేదన చెందుతున్నారు. సమావేశంలో కలెక్టర్ చెప్పే విషయాన్ని బట్టి తాము స్పందిస్తామని నలుగురు ఎమ్సీ మెంబర్లు సాక్షికి తెలిపారు. చట్టబద్ధంగా ఎంపికైన తమను తొలగించే అధికారం కలెక్టర్‌కు లేదంటూ గంధం ప్రసన్నాంజనేయులు, మలిరెడ్డి కోటారెడ్డి కోర్టులో ఇప్పటికే పిటిషన్‌ను దాఖలు చేశారు. కలెక్టర్ నిర్ణయాలు రెడ్‌క్రాస్‌లో సేవలకు అనుకూలంగా ఉంటాయో.. లేదా నిర్వీర్యంగా మారుతాయో తెలియాల్సి ఉంది.

ఆర్టీసీకి సంక్రాంతి సిరులు

- పండగ రాబడి రూ.1,11,66,421
- జిల్లాలోని ఏడు డిపోల నుంచి 394 బస్సులు



ఆర్టీసీ బస్సులు

కావలి: సంక్రాంతి పండగ ఆర్టీసీకి సిరులు కురిపించింది. ప్రత్యేక బస్సులను నడపడం ద్వారా జిల్లా పరిధిలోని ఆర్టీసీకి రూ.1,11,66,421 రాబడి సమకూరింది. ప్రయాణికుల సౌకర్యార్థం జిల్లాలోని ఏడు డిపోల నుంచి 394 ప్రత్యేక బస్సులను నడిపారు. 2,96,738 కిలోమీటర్లు తిరిగిన ఇందులో 30,652 మంది ప్రయాణించారు. ఆక్యుపెన్సీ రేషియో 66.01 శాతంగా నమోదైంది. కిలోమీటర్‌కు సగటున రూ.37.63 రాబడి వచ్చింది.

ఆక్యుపెన్సీలో నెల్లూరు – 2 టాప్

నెల్లూరు – 2 డిపో 80.85 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో టాప్‌లో నిలిచింది. 55.70 శాతంతో ఆత్మకూరు డిపో చివరి స్థానం దక్కించుకుంది. రెండు, మూడు స్థానాల్లో కావలి, నెల్లూరు – 1 డిపోలు ఉన్నాయి. కిలోమీటర్‌కు వచ్చిన రాబడిలో నెల్లూరు – 2 డిపో 47.11 శాతంతో మొదటి స్థానంలో.. ఆత్మకూరు డిపో 30.98 శాతంతో చివరి స్థానంలో నిలిచింది. ఇందులోనూ రెండు, మూడు స్థానాల్లో కావలి, నెల్లూరు – 1 డిపోలు ఉన్నాయి. ప్రయాణికులకు జిల్లా ప్రజా రవాణాధికారి మురళీబాబు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాలో ఇలా..

డిపో	బస్సులు	తిరిగిన కిలోమీటర్లు	ప్రయాణించిన వారు	రాబడి
ఆత్మకూరు	31	27,138	1,520	రూ.8,40,808
కావలి	26	22,046	2,185	రూ.9,00,602
కందుకూరు	69	53,669	4,319	రూ.18,03,155
నెల్లూరు - 1	95	77,540	8,345	రూ.28,54,022
నెల్లూరు - 2	95	57,627	8,464	రూ.27,15,006
రాపూరు	17	15,462	837	రూ.5,31,380
ఉదయగిరి	61	43,256	4,982	రూ.15,21,448

ఈఎంటీ పోస్టుల భర్తీకి చర్యలు

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని 108 వాహనాల్లో ఖాళీగా ఉన్న ఈఎంటీ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టామని జిల్లా మేనేజర్ బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎన్‌ఎం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీ – ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ తదితర కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులని చెప్పారు. దరఖాస్తులను ఈ నెల 29లోపు పొందాలని, వివరాలకు 83284 61648, 96420 27098 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కల్తీ మద్యం ముఠా గుట్టురట్టు



నిందితులతో ఎక్సైజ్ అధికారులు

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- 57 క్వార్టర్ల స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): కల్తీ మద్యం విక్రయాలకు పాల్పడుతున్న ముఠా గుట్టును ఈఎస్ స్క్వాడ్ అధికారులు బుధవారం రట్టు చేశారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు – 2 అధికారులకు అప్పగించారు. తన కార్యాలయంలో వివరాలను నెల్లూరు – 2 ఇన్‌స్పెక్టర్ ప్రసన్నలక్ష్మి వెల్లడించారు. నెల్లూరు రూరల్ మండలం పెనుబర్తికి చెందిన చెందిన శ్రీను అలియాస్ డాన్ శ్రీను, వెంకయ్య, విష్ణు ముఠాగా ఏర్పడి కల్తీ మద్యం విక్రయాలకు తెరలేపారు. ఇతర రాష్ట్రాలకు చెందిన తక్కువ నాణ్యత కలిగిన వివిధ బ్రాండ్ల మద్యాన్ని దిగుమతి చేసుకొని అప్పటికే సేకరించిన రూ.140, రూ.130 ఎమ్మార్పీ ఉండే ఖాళీ సీసాల్లో నింపి విక్రయించి సొమ్ము చేసుకోసాగారు. ఇలా కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు సాగిస్తున్నారు. దీనిపై జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందింది. వీరి ఆదేశాల మేరకు ఈఎస్ స్క్వాడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనిబాబు, సిబ్బందితో కలిసి శ్రీను ఇంటిపై దాడులు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి 57 క్వార్టర్ల కల్తీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులు, స్వాధీనం చేసుకున్న మద్యాన్ని ఎక్సైజ్ నెల్లూరు – 2 కార్యాలయంలో అప్పగించారు. నిందితులను అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

